# పోటీ

రచన : గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

అతను అవతల్నుంచే బస్సుకమ్మీని ఘట్టిగా పట్టుకున్నాడు. నేనూ ఎక్కబోయాను. ఒకని చెయ్యి అడ్డంవచ్చింది. ఇంతలోకి బస్సు కదిలింది. అతను దబ్బున ఎలాగో దూరాడు. నాకు బస్సుకమ్మీ అందీ అందకుండా వుంది. అతనిచెయ్యి నన్ను ఇవతలికి నెట్టేసింది. నేను కిందికి పడాల్సినమాటే గానీ, కండక్టరు నాచెయ్యి పట్టుకుని లోపలికి చేదేసుకున్నాడు.

బతుకుజీవుడా అంటూ లోపలికి వెళ్ళాను. రాయపేటలో దిగడానికి ఒక మనిషి లేచాడు. ఇహ నేను కూచోవచ్చును గదా అని సర్దుకుంటూండగానే, నాకూ లేచిపోతూన్న మనిషికీ మధ్య సందులోనుంచీ ఒకాయన సీటులోకి జరిగాడు. ఆరి వీడి తస్సాగొయ్యా! ఎంత సమర్థుడు! అతను ఎవరోకాదు ఇందాక నన్ను ఎక్కనివ్వకుండా సాయంచేసిన ఆ మహానుభావుడే!

పోనీ, ఎవరు కూచుంటే ఏం పోయింది. అతనే పాముకోనీ అని నేనూ ఊరుకున్నాను. మళ్ళా స్టాపింగులో మరో మనిషి దిగిపోవటాన నాకూ సీటు దొరికింది. అతను చివర కూచున్నాడు. అతని పక్కన ఇవతలగా నేను కూచున్నాను.

మౌంట్ రోడ్ స్టాపింగులో ఇద్దరు డాక్టర్ చదువుతున్న విద్యార్థినులు స్టెతస్కోపులు పట్టుకొని యెక్కారు. నా పక్కన కూచున్నాయన వెనక్కి తిరిగిచూసి, వాళ్ళ ఆదరాన్ని పొందడానికి గామాలు — అడుక్కుతిన్న ఆవరం — నన్ను జరగమని, లేచి వాళ్ళని ఆహ్వానించాడు.

వాళ్ళు సంకోచించారు. ఒక్క సీటే ఖాళీ వుండె. అదీ నన్ను రానుకుపోవాలి. వాళ్ళు మొహం, మొహం చూసుకున్నారు. బస్సులో కూచున్న మంద మందా నాకేసి చూశారు. నేను ఇంకా లేవలేదని గామాలు.

వీళ్ళంతా స్టేజీలెక్కి ఆడా మగా సమానం అని లెక్చర్లిచ్చేస్తారు గదా, మరీ తేడాదేనికి? నిజానికి ఆడాళ్లు ఇలా తమజాతినీ, అందాన్నీ, షోకుల్నీ ఆసరాగా చేసుకుని సీటుకోసం ఎదురుచూడ్డం నాకు అసహ్యం అనిపించింది.

అయినా, నేను సంచోక తప్పిందికాదు.

తరవాత ఆ మనిషివేపు నేను చూడనుకూడా చూడలేదు. నేను సెంట్రల్ లో దిగినప్పుడు అతనూ సెంట్రల్ లో దిగాడని మాత్రం గుర్తించాను. తరవాత నా దోవన నేను కాలేజీకి వెళ్ళాను.

అది రెండోరోజే అవటాన క్లాసులు లేవు. అసలు కాలేజీలోనే పట్టుమని పది మంది వొచ్చారో లేదో.

నేను పుస్తకాలనుగురించి విచారిస్తూ ఒక అటెండరును మంచిచేసుకుంటున్నాను. అనాటమీ పుస్తకం ఒకటి తనదగ్గిఱ వుందనీ, అది పాతిక రూపాయల కిస్తాననీ చెబుతున్నాడు. వాడు నశ్యంపీలుస్తూ, అస్థిపంజరం కావాలా సార్? అని అడుగుతూండగా, పడమటి దిక్కునుంచీ ఒకగొంతు వినిపించింది. “అనాటమీ ఎంత?” అని. “పాతిక” అన్నాడు బుజ్జిమీసాల అటెండరు స్టాలిన్ లాగా.

నేను వెనక్కి తిరిగిచూశాను. ఆరి నీ ఇల్లు బంగారంగానూ! అతనే! ఇదేమిటి చెప్మా అతనూ ఇక్కడికే రావడం! అతనూ ఈ కాలేజీలోనే చేరాడు గామాలు. అయితే ఇహ ఈ పీడాకారం నన్ను వొదలదన్న మాట!

“అనాటమీ పుస్తకం మీకు కావాలా?” అసలు సంగతేమిటో తెలుసుకుందామని అతణ్ణి అడిగాను.

“అచ్చే, మీరు బేరంచేశాక నేను కొనడమేమిటి?” అన్నాడాయన పెద్దమనిషిలాగా.

శివరాం అంటే తెల్లతొడుగు తొడిగిన నల్లవిగ్రహం అన్నమాట. అతను బియ్యేపాసై, ఒక ఏడాది ఏదో ఉద్యోగంచేసి, దీనికి వొచ్చాడట. అతణ్ణి కాలేజీలో చూసినప్పట్నుంచీ, అతని సావాసంచేసి, అతని శీలాన్ని పరిశీలించాలనే అభిలాష కలిగింది నాకు.

మర్నాడు పాతిక రూపాయలూ తీసికెళ్ళాను పుస్తకం కొనుక్కోడానికి. పోయి ఆ బుజ్జిమీసాల అటెండరును అడుగుదును గదా, ఏముందీ? ఆ పుస్తకాన్ని అతను కొనుక్కు పోయాడట నిన్న సాయంత్రం వొచ్చి. మనిషికి ఎన్ని భావాలు రావాలో అన్ని భావాలూ నాకూ వొచ్చాయి, కానీ ఆ జవానుమీద విరుచుకుపడితే ఏం లాభం? మెల్లిగా కాళ్ళీడ్చుకుంటూ కాంటీనుకు దారి తీశాను. శివరాం అక్కడో కుర్చీలో కూచుని కాఫీతాగుతూ నాకు గుడ్ మార్నింగ్ చెప్పాడు.

ఆర్నెల్లుదాటినా నాకు కాలేజీలో ఎక్కువ మందితో పరిచయంలేదు. కానీ, రోజూ నాతోటే మాంబళంనుంచీ ఒక అమ్మాయి వొస్తూవుంటుంది. ఆ అమ్మాయి మాత్రం మూడోరోజు రైల్లో వచ్చేటప్పుడు నా పక్కనే కూచోటం తటస్థించి నన్ను పలకరించింది. ఆ ఉపోద్ఘాతం స్నేహమైంది.

ఆ అమ్మాయిపేరు నళిని. చూట్టానికి బాగానే వుంటుంది, చామంచాయ అయినప్పటికీ. స్త్రీలకు యవ్వనంలాంటి ఆభరణం వేరే లేదని ఎలెక్ట్రిక్ ట్రెయిన్ వూపులో జారుతూన్న పమిటె మాటునదాగిన యెత్తు భాగాలూ, గాలి అలల్లో యెగురుతూన్న ముంగురులూ, ప్రేమకోసం నా హృదయంలోకి లోతుగా చూస్తూన్న ఆమె చంచల నయనాలూ నాకు రూఢిగా చెప్పినై.

ఆర్నెల్ల పరీక్షల్లో నాకు ఫస్టుమార్కు రావటంవల్ల బహుమతి యిస్తామని ప్రొఫెసర్ చెప్పాడు. నళినికి అందులో రెండో మార్కూ, శివరాంకు నళినికంటే రెండు మార్కులు తక్కువా వచ్చాయి. శివరాం మళ్ళా నాకు సాయంచెయ్యటానికి వచ్చాడు. మళ్ళా పరీక్షపెడితేకానీ వల్లకాదని పరీక్ష పెట్టించాడు. అందులో నళినికి నాకంటే ఒక మార్కు ఎక్కువొచ్చింది. శివరాం మనసు కుదటపడ్డది, ప్రైజు నాకు రాలేదు కదా అని.

నేనూ నళినీ మామూలుగా కాలేజీ గేటు దాటివొచ్చేసరికి “హల్లో మిస్ నళినీ కంగ్రాచులేషన్స్” అన్న శివరామ్ అభినందనలు వినిపించాయి. నళిని చిఱునవ్వుతో అభినందనలు అందుకుని నామీదినుంచీ అతణ్ణి చూస్తూ నడిచింది.

“అలా కాంటీన్ వేపు వెళ్ళి ఓకప్పుకాఫీ తాగొద్దాం” శివరామ్ బుష్ కోటు జేబీలోనుంచీ చేతిరుమాలుతీస్తూ అన్నాడు.

నళిని నావైపు చూసింది. “నువ్వూ రా” అన్నది.

“నేనిప్పుడే భోంచేసి వచ్చాను” అన్నా.

“ఫరవాలేదు రావోయ్” అన్నాడు శివరామ్ బంతిలో బలపక్షం అనకూడదని.

“నువ్వొస్తేనేగానీ నేను వెళ్ళను” నళిని అంత నిక్కచ్చిగా చెబుతుందని అనుకోలేదు.

నళినికి నామీద ఎంత అభిమానం! నా చెవుల్లో విజయశంఖారావం వినిపించింది.

రెడ్ ఫోర్ట్ నాకేసి డేంజర్ సిగ్నల్ లాగా చూసింది. నేను పాలిపోయిన శివరామ్ముఖంలోకి చూస్తూ నిలుచున్నాను. నళిని ఏమీ బోధపడక మమ్మల్ని ఎగాదిగా చూసింది.